

17 నుంచి 23 వరకూ పలు రైళ్ల రద్దు

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

విజయవాడ పరిధిలో ట్రాక్ భద్రతా పనుల్లో భాగంగా ఈ నెల 17వ తేదీ నుంచి 23వ తేదీ వరకూ పలు రైళ్ళను రద్దు చేస్తూ దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఆదేశాలు ఇచ్చారు. ఈ మేరకు శనివారం సామర్లకోట రైల్వే ఎస్ఎం కార్యాలయానికిఉత్తర్వులు అందాయి. కాకినాడ నుంచి విశాఖపట్నం ప్యాసింజర్ స్పెషల్ ట్రైన్‌ను రద్దు చేశారు. రాజమండ్రి-విశాఖపట్నం ప్యాసింజర్‌ను, విశాఖ-విజయవాడ ఉదయ్ ఎక్స్‌ప్రెస్‌ను రద్దు చేసినట్లు పేర్కొన్నారు. ఈ నెల 18, 21, 22న ధన్‌బాద్-అలెప్పీ బొకారో ఎక్స్‌ప్రెస్‌ను దారి మళ్లించినట్టు పేర్కొన్నారు. ఈ నెల 21న టాటానగర్-ఎస్ఎంవి బెంగుళూరు ఎక్స్‌ప్రెస్‌ను దారి మళ్లించారు. మొత్తంగా 12 రైళ్ళను రద్దు చేయగా నాలుగు రైళ్లను దారి మళ్ళించారు.

ఆర్‌బికెల నిర్మాణంలో జాప్యం

- మూడేళ్లుగా సాగుతున్న పనులు
- నామమాత్రపు సేవలకే పరిమితం

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

రైతులకు అండగా రైతు భరోసా కేంద్రాలు నిలుస్తున్నాయని ప్రభుత్వం ఒక పక్క గొప్పలు చెబుతున్నా వాటి సేవలను పూర్తిస్థాయిలో అందించలేక పోతుంది. మూడేళ్లుగా ఆర్‌బికెల నిర్మాణాలు కొనసాగుతూనే ఉన్నాయి. పూర్తిస్థాయిలో నిధులు కేటాయించకపోవడంతో పలు ప్రాంతాల్లో పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా దర్శనమిస్తున్నాయి. మరోవైపు ఎరువులు, పురుగు మందులు సక్రమంగా ఉండడం లేదు. నామమాత్రంగానే ఇతర సేవలు అందుతున్న నేపథ్యంలో రైతులు గగ్గోలు పెడుతున్నారు.

అన్నదాతలకు అన్ని రకాల వ్యవసాయ సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి నిర్వహిస్తోంది. ఆచరణలో కొన్ని రకాల సేవలు మాత్రమే అందించగలుగుతోంది. కాకినాడ జిల్లాలో 21 మండలాల్లో 385 ఆర్‌బికెలు ఉండగా వీటిలో 141 అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా వీటి సేవలను 2020 మే 30న ముఖ్యమంత్రి జగన్ ప్రారంభించారు. 5 సెంట్ల స్థలంలో భవనం నిర్మించేందుకు ఒక్కో దానికి రూ.21.80 లక్షలు కేటాయించారు. వీటిలో 90 శాతం ఉపాధి హామీ పథకం నిధులు, 10 శాతం వ్యవసాయ శాఖ నిధులు వెచ్చించి భవనాలు నిర్మించాల్సి ఉంది. పాత పంచాయతీల భవనాలు, ఇతర అద్దె భవనాల్లో ప్రస్తుతం పలు ఆర్‌బికెలు నడుస్తున్నాయి. కొన్ని పూర్తి అయ్యి ప్రారంభించారు. గతంలో వ్యవసాయ సేవలు పొందాలంటే రైతులు మండల కేంద్రాలకు వ్యయప్రయాసలు పడుతూ వెళ్లేవారు. దీంతో రైతులకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా పల్లె ముంగిట్లోనే సేవలు అందుబాటులో ఉండేలా ఈ కేంద్రాలు పని చేస్తున్నాయని పాలకులు, అధికారులు అంటున్నారు.


కాకినాడ రూరల్ పెనుమర్తిలో పునాదుల్లోనే ఆర్‌బికె

ఎప్పటికి పూర్తి అయ్యేనో..

మూడేళ్ల క్రితం భవనాలు మంజూరైనప్పటికీ నిర్మాణాలు పూర్తి కాలేదు. జిల్లాలో మొత్తం 385 భవనాలకు గానూ 36 భవనాల పనులు ఇంకా ప్రారంభమే కాలేదు. 74 పునాదుల దశలో ఉండగా 53 బేస్ మెంట్ లెవెల్ కంటే తక్కువ స్థాయిలో ఉన్నాయి. 38 స్లాబ్ వరకూ నిర్మాణాలు జరగ్గా, 59 స్లాబులు పూర్తయ్యాయి. 89 మాత్రమే భౌతికంగా పూర్తయ్యాయి. కరప మండలంలో 20 ఆర్‌బికెలు నిర్మాణాలు జరుగుతుండగా పాతర్లగడ్డ, గురజానపల్లి, పెద్దాపురప్పాడు, వేళంగి ప్రాంతాల్లో మాత్రమే పూర్తయ్యాయి. అరట్లకట్ల, కొంగోడు, నడకుదురు, ఉప్పలంక, వాకాడ, వేములవాడ, గ్రామాల్లో పనులు ఇంకా జరుగుతూనే ఉన్నాయి. కరప, గొర్రిపూడి, కొరుపల్లి, సిరిపురం, పెనుగుదురు, యండమూరు గ్రామాల్లో పునాదుల దశలోనే నిలిచిపోయాయి. ప్రభుత్వం నుంచి నిధులు సక్రమంగా విడుదల కాకపోవడంతో మూడేళ్లుగా నిర్మాణాలు ముందుకు కదలడం లేదు. స్థానిక పంచాయతీ సర్పంచులు ఇతర ప్రజాప్రతినిధులు వీటి నిర్మాణాలు చేపట్టగా బిల్లులు విడుదలలో తీవ్ర జాప్యం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పిఠాపురం మండలంలో 23 ఆర్‌బికెల నిర్మాణాలు జరుగుతుండగా మూడేళ్లలో ఒక్కటి కూడా పూర్తి కాలేదు. జములపల్లి, గోకివాడ, నరసింగపురం, ఫక్రుద్దీన్‌పాలెం, కందరాడ, కుమారపురం, చిత్రాడ తదితర ప్రాంతాల్లో నిర్మాణాలు మధ్యలో ఉన్నాయి.అటు కాకినాడ రూరల్ మండలంలో వాకలపూడి, తమ్మవరం, పెనుమర్తి తదితర చోట్ల పునాదుల దశ దాటలేదు. కొన్ని మండలాల్లో పనులు ప్రారంభం కాగా, మరికొన్ని మండలాల్లో ప్రారంభానికి నోచుకోలేదు. దాంతో అరకొర వసతుల మధ్య సిబ్బంది ఇబ్బందులు పడుతూ విధులు నిర్వహిస్తున్నారు.


వాకలపూడిలో ఇలా..

సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సీదిరి అప్పలరాజు

ప్రజాశక్తి-కాకినాడ

అసెంబ్లీ నియోజకవర్గ సమీక్షా సమావేశాల్లో చర్చించిన ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం అందించేందుకు మిషన్ మోడ్ శైలిలో పని చేయాలని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, రాష్ట్ర పశ సంవర్థక, పాడిపరిశ్రమ మత్స్యశాఖల మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అధికారుకు సూచించారు. శనివారం జగ్గంపేట అసెంబ్లీ నియోజకవర్గ సమీక్షా సమావేశం మంత్రి సీదిరి అప్పలరాజు అధ్యక్షతన కలెక్టరేట్‌లోని విధాన గౌతమి సమావేశ హాల్లో నిర్వహించారు. ఎంపీ వంగా గీత, జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా, హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, జగ్గంపేట ఎంఎల్ఎ జ్యోతుల చంటిబాబు, జగ్గంపేట, కిర్లంపూడి, గండేపల్లి మండలాల ఎంపిపిలు, జెడ్‌టిసిలు, మండల అధికారులు ఈ సమావేశంలో పాల్గొని నియోజకవర్గంలో వివిధ అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి అప్పలరాజు మాట్లాడు రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో సమస్యలను స్థానిక ఎంఎల్ఎ, జిల్లా కలెక్టర్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధుల సమిష్టిగా చర్చించి, వాటికి తక్షణ పరిష్కార చర్యలు చేపట్టేందుకు ప్రతి శనివారం జిల్లాలో ఎంపిక చేసిన ఒక నియోజకవర్గంలో సమీక్ష నిర్వహించాలని ముఖ్యమంత్రి ఆదేశించారన్నారు. ఇందులో భాగంగా కాకినాడ జిల్లాలో తొలి సమావేశంగా నిర్వహించిన జగ్గంపేట నియోజకవర్గ సమీక్ష అత్యంత ప్రయోజనకరంగా జరిగిందని, ప్రజలు ఎదుర్కొంటున్న సూమారు 23 ప్రధాన సమస్యలను గుర్తించినట్టు చెప్పారు. వీటి పరిష్కారం కోసం ఆయా శాఖల జిల్లా, డివిజన్, మండల అధికారులు సోమవారం నిర్దిష్ట కార్యాచరణ నివేదకలను జిల్లా కలెక్టర్ కు సమర్పించాలని సూచించారు. శనివారం జరిగిన సమీక్షలో చర్చించిన సమస్యల్లో అత్యధిక అంశాలు నిధులు అవసరం లేకుండా అధికారుల సమన్వయంతో పరిష్కరించగలవే ఉన్నాయన్నారు. ఆయా శాఖలు సమిష్టిగా త్వరితగతిన వాటిని పరిష్కరించాలన్నారు. గతంలో రహదారుల నిర్వహణను నిర్లక్షం చేయడం వల్ల, పుష్కలంగా కురుస్తున్న వర్షాల వల్ల రోడ్లు దెబ్బ తిన్నాయని, వాటి పునరుద్ధరణకు అవసరమైన నిధులు ప్రభుత్వం మంజూరు చేస్తోందన్నారు. జగ్గంపేట నియోజక వర్గ పరిధిలో రోడ్ల అభివృద్ధి, మరమ్మతుల కోసం ఇటీవలే రూ.5 కోట్ల 70 లక్షలు నిధులు మంజూరు చేసిందన్నారు. టెండర్ల ప్రకియ వెంటనే పూర్తి చేసి, పనులు సత్వరం చేపట్టాలని ఆర్ అండ్ బి అధికారులకు సూచించారు. అభివద్ధి పనుల నిర్వహణకు ప్రతి గ్రామ పంచాయితీకి రాష్ట్ర ప్రభుత్వం కోటి రూపాయలు నిధులు కేటాయించిదని, వీటితో పాటు నాడు-నేడు, మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకం క్రింద పనులు అన్ని పంచాయితీల్లో విస్తతంగా జరుగుతున్నాయన్నారు. పిల్లల చదువు కోసం, కుటుంబ సభ్యుల వైద్యం కోసం అప్పులు పాలైయ్యే పరిస్థితి రాకుండా ప్రభుత్వం ప్రజలకు అండగా నిలుస్తోందని, ప్రభుత్వం అమలు చేస్తున్న ఆదర్శనీయమైన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజాప్రతినిదులు ప్రజలకు వివరించాలని కోరారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ ప్రఖర్ జైన్, జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి పి.త్రినాథ్, పెద్దాపురం ఆర్‌డిఒ జె.సీతారామారావు, తహశీల్దార్లు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీదిరి అప్పలరాజు

ఆలూరికి దుర్గాబాయి దేశ్‌ముఖ్ పురస్కారం

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

ప్రముఖ వైద్యురాలు, రచయిత, సామాజిక కార్యకర్త డాక్టర్ ఆలూరి విజయలక్ష్మిని దుర్గాబాయి దేశ్‌ముఖ్ పురస్కారంతో సత్కరించారు. స్థానిక జెఎన్‌టియుకె సెనేట్ హాల్లో అఖిలభారత మహిళా కాన్ఫరెన్స్ కాకినాడ బ్రాంచ్ ఆధ్వర్యంలో దుర్గాబాయి దేశ్‌ముఖ్ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ ఐవి.రావు మాట్లాడుతూ డాక్టర్ ఆలూరి విజయలక్ష్మి కాకినాడలో నాలుగు దశాబ్దాలుగా ఒకవైపు వైద్యురాలిగా సేవలందిస్తూ మరోవైపు మహిళల సంక్షేమానికి అభివద్ధికి ఎనలేని కషి చేశారన్నారు. ఎంవి.భరతలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ శైలజ, డాక్టర్ కమల కుమారి, ఆర్.ఆదినారాయణ, భానుమతి, పద్మజావాణి ప్రభతులు డాక్టర్ ఆలూరి విజయలక్ష్మి సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా డాక్టర్ ఆలూరి విజయలక్ష్మిని ప్రొఫెసర్ దోసగిరి రావు, వక్కలంక రామకృష్ణ, అడబాల రత్నప్రసాద్, చింతపల్లి సుబ్బారావు తదితరులు ఘనంగా సత్కరించారు.

సహకార ఉద్యోగులకు వ్య.కా.సం. మద్దతు

ప్రజాశక్తి - తాళ్లరేవు

సహకార ఉద్యోగ సంఘాల ఐక్యవేదిక చేస్తున్న పోరాటానికి ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు టేకుమూడి ఈశ్వరరావు, కెఎస్.శ్రీనివాస్ పూర్తి మద్దతు తెలిపారు. వారు విలేకరులతో మాట్లాడుతూ వ్యవసాయ సహకార పరపతి సంఘాలు రైతులకు ఎంతో మేలు చేకూర్చే విధంగా ఉన్నాయన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వాటికి ఎక్కువ నిధులను కేటాయించి రైతులను ప్రోత్సహించకుండా రైతులను మోసం చేసే విధంగా వ్యవహరిస్తున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 50 శాతం ప్రైవేట్ వ్యక్తులకు, కంపెనీలకు వాటాదారులుగా చేస్తూ సహకార చట్టానికి ప్రభుత్వం చేసిన సవరణ రద్దు చేయాలని, 36 మరియు 96 జిఒల ప్రకారం వేతనాలు అమలు చేయాలన్నారు. పలు డిమాండ్లపై ఉద్యోగులు చేస్తున్న ఉద్యమం న్యాయబద్ధమైనదన్నారు.

న్యాయం చేసే వరకూ రైతుల పోరాటం

ప్రజాశక్తి-పిఠాపురం

గోకివాడలోని అక్కినీడి వారి చెరువు పుట్టకుంట కాలువపై అధికారులు తొలగించిన షట్టర్లు తిరిగి ఏర్పాటు చేసే వరకూ పోరాటం ఆగదని రైతులు స్పష్టం చేశారు. రైతులు చేస్తున్న నిరాహార దీక్ష శనివారం ఐదో రోజుకు చేరుకుంది. ఈ దీక్షల్లో గ్రామ రైతులు ఎన్.కాశి, ఎన్.నానాజీ, ఎన్.బ్రహ్మానందం, ఎం.వీర్రాజు, ఎన్.బాబులు ఉన్నారు. సమస్యను అధికారులు పరిష్కరించకపోవడంతో రైతులు గ్రామ సచివాలయం ముట్టడానికి పిలుపునిచ్చారు. పోలీసులు అక్కడకు భారీగా చేరుకోవడంతో రైతులు సచివాలయ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గేట్లు తొలగించే ముందు కనీసం గ్రామంలో ఏ అధికారీ పర్యటన చేయలేదని, రైతులతో సమావేశం కూడా నిర్వహించలేదని ఏకపక్ష ధోరణితో గేట్లు తొలగించారన్నారు. ఆందోళన చేస్తున్న, రిలే నిరాహారదీక్ష చేస్తున్న, వినతిపత్రాలు ఇచ్చిన నేటికి అధికారులు సమస్యను పరిష్కరించలేదని రైతుల ఆవేదన వ్యక్తం చేశారు. షట్టర్లు తొలగించిన స్థానంలో గ్రామంలో రైతులకు ఎవరికీ తెలియకుండా చెక్క బల్లలు వేసి వెళ్ళిపోయారని తొలగించిన షట్టర్ల స్థానంలో తిరిగి యథావిధిగా షట్టర్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కె.హరినాథ్‌బాబు, ఉప సర్పంచి నామా సురేష్, మాజీ సర్పంచ్ నామా వెంకట్రావు, మాజీ సర్పంచ్ గరగ సత్యానందం, నామా పెద్దిరాజు, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.



దీక్షలో పాల్గొన్న గ్రామ రైతులు

బ్యాలెట్, కంట్రోల్ యూనిట్ల తరలింపు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

కాకినాడ నుంచి అమలాపురం జిల్లాకు ఇవిఎం గొడౌన్ నుంచి 50 బ్యాలెట్ యూనిట్లు, 50 కంట్రోల్ యూనిట్ బాక్సలను ఆర్‌డిఒ ఎన్‌వివి.సత్యనారాయణ, తహశీల్దార్ సీతాపతి, ఇతర పార్టీ నాయకుల ఆధ్వర్యంలో శనివారం అమలాపురం తరలించారు. జిల్లాల విభజన నేపథ్యంలో అమలాపురం, రాజమహేంద్రవరం జిల్లాలకు వీటిని తరలిస్తున్నట్టు ఆర్‌డిఒ తెలిపారు.

సోమవారం డయల్ యువర్ కమిషనర్

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి సోమవారం ఉదయం 9:30 గంటల నుంచి 10:30 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ చెప్పారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి సోమవారం ఉదయం 9:30 గంటల నుంచి 10:30 గంటల మధ్యలో ప్రజలు కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయం ఫోన్ నెంబర్ 08842357800 నెంబర్‌కు కాల్ చేసి సమస్యలు తెలియజేయవచ్చునన్నారు. ప్రజలు తమ దష్టికి తీసుకువచ్చిన సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ చెప్పారు.

పీజీ సెట్‌లో ఎమ్మార్ విద్యార్థికి ర్యాంకు

ప్రజాశక్తి- పెద్దాపురం

ఎపి పీజీ సెట్ - 2023లో పెద్దాపురం మహారాణి కళాశాల విద్యార్థి కాళ్ల సత్య ఎంఎ తెలుగులో రాష్ట్రస్థాయి సెకండ్ ర్యాంకు సాధించినట్టు తెలుగు అధ్యాపకులు టివివి.సత్యనారాయణ తెలిపారు. విద్యార్థిని సత్యను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి.వీరయ్య చౌదరి, కళాశాల కరస్పాండెంట్ జాస్తి రమేష్, అధ్యాపకులు అభినందించారు. ఈ సందర్భంగా సత్య మాట్లాడుతూ ఈ ర్యాంకు సాధించేందుకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందించిన తెలుగు శాఖాధ్యక్షులు టివివి.సత్యనారాయణకు కృతజ్ఞతలు తెలిపారు.

పంపా ఆయకట్టుకు నీరు విడుదల

ప్రజాశక్తి-అన్నవరం

ఖరీఫ్ సీజన్ నేపథ్యంలో అన్నవరం పంపా ఆయకట్టు పొలాలకు రిజర్వాయర్ నీటిని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా శనివారం విడుదల చేశారు. ఆయకట్టు రైతులు, ఇరిగేషన్ అధికారుల సమక్షంలో స్విచ్ ఆన్ చేసి దిగువ ప్రాంతాల ఆయికట్టుకు నీటిని వదిలారు. ఈ సందర్భంగా మంత్రి రాజా మాట్లాడుతూ తుని నియోజకవర్గంలో పంపా రిజర్వాయర్ ద్వారా గతంలో 12,500 ఎకరాలు ఆయకట్టు సాగయితే ఇప్పుడు15 వేల ఎకరాలు సాగవుతోందని తెలిపారు. ఇరిగేషన్ ఇఇ రాజగోపాల్ మాట్లాడుతూ ఈ ఖరీఫ్ సీజన్ ఆరు నెలల పాటు పంపా ఆయకట్టు పొలాలకు రోజుకి 30 క్యూసెక్కుల నీటిని వదులుతామని, పరిస్థితిని బట్టి ఇంకా అవసరమైతే మరిన్ని క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తామని తెలిపారు. ప్రస్తుతం పంపానీటి మట్టం 99.30 అడుగుల ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ డిఇ కాశి సురేష్, శ్రీదేవి, వైసిపి నాయకులు గంగ బాబు, గాబు రాజు, నవీన్, చంద్రగిరి, వై.గిరి తదితరులు పాల్గొన్నారు.


నీటిని విడుదల చేస్తున్న మంత్రి దాడిశెట్టి రాజా

పురోహితుల వేలం వివాదానికి తెర

ప్రజాశక్తి-అన్నవరం

అన్నవరం దేవస్థానంలో పెళ్లిళ్లు ఉపనానాలు జరిపించే పురోహితుల సింగిల్ విండో విధానంలో వేలంపాట నిర్వహించేందుకు విషయమై దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ సమక్షంలో ఒప్పందం కుదిరింది. దేవస్థాన అధికారులు ఇటీవల తీసుకున్న విధాన నిర్ణయంపై రెండు రోజుల కిందట వివిధ ప్రాంతాల నుంచి బ్రాహ్మణ సంఘాలు అన్నవరం దేవస్థానం ఇఒ ఇంటి వద్దకు వచ్చి వేలంపాట నిర్ణయాన్ని రద్దు చేయాలని నిరసన వ్యక్తం చేశారు. దీనిపై రాజకీయ దుమారం రేగింది. జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ దేవస్థానం అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ బ్రాహ్మణ సంఘాల నిరసనకు తన మద్దతు ఉంటుందనిప్రకటించారు. ఈ నేపథ్యంలో మంత్రి సత్యనారాయణ పురోహితుల సంఘం సభ్యులతో విజయవాడలో మాట్లాడారు. ఈ నిర్ణయం వల్ల దళారీ వ్యవస్థ కట్టడి అవుతుందని అవగాహన కల్పించారు. దీంతో వేలంపాట నిర్ణయానికి పురోహితులు మద్దతు పలికారు. సంఘం తరపున అధ్యక్షుడు నాగబ్బట్ల రవి శర్మ పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా పరిశీలనకు సిద్ధం కావాలి

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

ఓటర్ల జాబితా పరిశీలనకు సిద్ధం అవ్వాలని కాకినాడ రూరల్ నియోజకవర్గ ఎలక్టోరల్ అధికారి, ఆర్‌డిఒ ఎన్‌వివి.సత్యనారాయణ అన్నారు. ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ పర్యవేక్షణాధికారులతో ఆర్‌డిఒ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆర్‌డిఒ మాట్లాడారు. ఈ నెల 21 నుంచి ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఆగస్టు 21వ తేదీ వరకూ సుమారు నెల రోజులపాటు క్షేత్రస్థాయిలో ఓటర్ల జాబితా పరిశీలన జరగనున్న నేపథ్యంలో పర్యవేక్షణాధికారులు ప్రత్యేక చొరవ చూపాలని, రోజువారీ లక్ష్యాలను నిర్ధేశించుకుని దోషరహిత జాబితా రూపకల్పనకు చర్యలు తీసుకోవాలన్నారు. కాకినాడ రూరల్ నియోజకవర్గంలో సుమారు రూ.రెండు లక్షల 55 వేల 137 మంది ఓటర్లు ఉన్నారని, 264 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. 18 మంది పర్యవేక్షణ అధికారులు ఓటర్ల జాబితాను రాజకీయ పార్టీ ప్రతినిధులతో పరిశీలన జరుపుతారన్నారు. ఈ సమావేశంలో రూరల్ తహసీల్దార్ మురార్జీ, కరప తహశీల్దారు పి.శ్రీనివాసరావు పరిపాలనాధికారి వరహాలయ్య, ఎన్నికల డిటి చైనులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డిఒ

వ్యాధులపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - పెద్దాపురం


ప్రతి ఒక్కరూ సీజనల్ వ్యాధులపై అవగాహన పెంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ జె.సురేంద్ర అన్నారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణలోని మెప్మా కార్యాలయంలో సీజనల్ వ్యాధులపై అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరు ఇంటి ఆవరణలో, ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సానిటరీ ఇన్‌స్పెక్టర్ దావీదు రాజు మాట్లాడుతూ నీటి నిల్వలు పేరుకుపోవడం వల్ల దోమలు ఉత్పత్తి అవుతాయని, ఈ దోమల వల్లే ప్రజలు అనేక రోగాలకు గురవుతారని చెప్పారు. ఈ సదస్సులో పబ్లిక్ హెల్త్ సెంటర్ వైద్యాధికారులు డాక్టర్ సాయికిరణ్, డాక్టర్ మొనంద్ చంద్ర, జీవన్, హెల్త్ సెక్రటరీ వెంకట్రావు పాల్గొన్నారు.

వల్లభ స్వామి ఆలయానికి రూ.3.05 లక్షల ఆదాయం

ప్రజాశక్తి - పెద్దాపురం

తిరుపతి గ్రామంలోని శృంగార వల్లభ స్వామి ఆలయానికి శనివారం ఒకరోజు వివిధ టిక్కెట్ల ద్వారా రూ.2,20,120, అన్నదానం విరాళాల ద్వారా రూ.78,749, కేశఖండన ద్వారా రూ.6,950 ఆదాయం సమకూరిందని ఆలయ ఇఒ పులి నారాయణమూర్తి తెలిపారు. యాత్రికులకు ఉదయం పులిహోర ప్రసాదం, మధ్యాహ్నం మహా అన్నదానం నిర్వహించామన్నారు. యాత్రికులకు ప్రజా ప్రతినిధులు కర్రి జగదీష్, కుంచే బుచ్చిరాజు, స్వచ్ఛంద సేవకులు అంజనీ కుమార్, ఆలయ సిబ్బంది, గ్రామస్తులు సేవలందించారు.

కార్టూ'నిజం'



జగనన్న సురక్షలో ధ్రువపత్రాల పంపిణీ

జిల్లాలో పలుచోట్ల శనివారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో లబ్ధిదారులకు ధ్రువపత్రాలు పంపిణీ చేశారు.

ప్రజాశక్తి- యంత్రాంగం

రౌతులపూడి మండలం గుమ్మరేగులలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ప్రత్తిపాడు ఎంఎల్ఎ పర్వత శ్రీపూర్ణచంద్ర ప్రసాద్ హాజరై మాట్లాడారు ప్రజా సేవ చేస్తున్న వాలంటీర్లపై ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారం మానుకోవాలని ఎంఎల్ఎ పర్వత హితువు పలికారు ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వానికి మరో అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ జిగిరెడ్డి రమణమ్మ, జెడ్‌పిటిసి లక్ష్మణమూర్తి, సర్పంచులు రామకష్ణ, కోటి బాబు పాల్గొన్నారు. **సామర్లకోట రూరల్** వేట్లపాలెంలో ఎంపిపి బొబ్బరాడ సత్తిబాబు అధ్యక్షతన జరిగిన సభలో హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ ప్రభుత్వము చేపట్టలేని విధంగా అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయడం ద్వారా ప్రజల సంక్షేమమే లక్ష్యంగా యువ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి సేవలందిస్తున్నారన్నారు. మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ కష్ణమూర్తి, వైస్ చైర్మన్ ఊబా జాన్‌మోజెస్, కమిషనర్ జె.రామారావు కౌన్సిలర్లు స్వయంవరపు వీరభద్రరావు, చిట్టిమాని వీర్రాఘవ, నమ్మి శ్రీనివాస్ పాల్గొన్నారు. **తాళ్లరేవు** మండలం పోలేకుర్రులో సర్పంచ్ వెంటపల్లి నూకరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో 550 మందికి పలు రకాల సర్టిఫికెట్లను అందించారు. ఎంపిపి రాయుడు సునీత, ఎఎంసి చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, రాయుడు గంగాధర్, బళ్ల సంధ్యారాణి, కాలిపల్లి సుబ్రహ్మణ్యం, పలివెల నాగేశ్వరరావు, ప్రసన్న, మల్లాడి భైరవమూర్తి పాల్గొన్నారు.


సామర్లకోట రూరల్‌లో..

భవిష్యత్తు ప్రణాళికపై అవగాహన

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

పెదపూడి మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో అలయన్స్ క్లబ్ ఆఫ్ కాకినాడ స్వాతి హెల్పింగ్ హాండ్స్ ఆధ్వర్యంలో విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా అలయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ కమిటీ చైర్మన్ డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, విశిష్ట అతిథిగా ఎంఇఒ సత్యనారాయణ, గ్రామ పెద్ద అబ్బులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ చప్పిడి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచీ భవిష్యత్తుపై ప్రణాళిక చాలా అవసరం అన్నారు. సరైన ప్రణాళిక ఉన్నప్పుడే మంచి భవిష్యత్తు ఏర్పడుతుందన్నారు. విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బాగా చదువుకుని మంచి విజ్ఞానం సాధించి జీవితంలో స్థిరపడడమే కాక సమాజానికి పయోగపడే పనులను చేయాలని కోరారు. హెచ్ఎం కె.సత్యనారాయణ మాట్లాడుతూ గురువులు, పెద్దలు తల్లిదండ్రుల పట్ల గౌరవభావంతో మెలగాలని, మన దేశంలో గొప్ప నాయకులను స్ఫూర్తిగా తీసుకుని వారి అడుగుజాడల్లో నడవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి పెంకే గోవిందరాజులు, కోశాధికారి కొత్త శ్రీరాములు, వనుం ఉపేంద్రనాథ్, ఐసిహెచ్ ఎం.ఉదయ్ కుమార్, సిజిఒ గుండు విశ్వనాథం, పీడీ గిరి పాల్గొని మార్గ నిర్దేశం చేశారు.



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

ప్రజాశక్తి-కాకినాడ

సాంకేతితను అందిపుచ్చుకోవాలని నేషనల్ ఫిజికల్ లేబరేటరీ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జి.భవన్నారాయణ అన్నారు. శనివారం కాకినాడ పిఆర్ కళాశాలలో నేవల్ మెటీరియల్స్, నానో టెక్నాలజీ, బయో మెడికల్ అప్లికేషన్స్ అంశంపై జాతీయ సదస్సును నిర్వహించారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం భౌతిక శాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బివి తిరుపణ్యం అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో భవనారాయణ మాట్లాడుతూ వైద్యరంగంలో నానో పదార్థాల పాత్ర గురించి తెలుసుకోవాలన్నారు. డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ డాక్టర్ కెఎస్ రమేష్ అభినందనలు తెలిపారు.

నేరాలు ఘోరాలు

పలుచోట్ల విజిలెన్స్ దాడులు

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

శనివారం ఉమ్మడి జిల్లాలో విజిలెన్స్ అధికారులు పలు దుకాణాల్లో ఆకస్మిక దాడులు నిర్వహించినట్టు ఇన్‌ఛార్జి విజిలెన్స్ ఎస్.పి. కె.కుమార్ తెలిపారు. తూర్పు గోదావరి జిల్లా గోపాలాపురం మండలం చిట్యాలలో శ్రీ భవాని ఎంటర్‌ప్రైజెస్ ఎరువుల దుకాణంలో స్టాక్ వ్యత్యాసం ఉండడంతో షాపు యజమానిపై 6-ఎ కేసు నమోదు చేసినట్టు తెలిపారు. సుమారు రూ.53,000 విలువైన 4.450 మెట్రిక్ టన్నుల ఎరువులను సీజ్ చేసినట్టు తెలిపారు. ఈ తనిఖీల్లో డిఎస్‌పి పి.ముత్యాలనాయుడు, ఇన్‌స్పెక్టర్ రమేష్, తహాశీల్దార్ విజయ్ కుమార్ పాల్గొన్నారు.

మద్యం తరలిస్తున్న ఇద్దరు అరెస్ట్

ప్రజాశక్తి-రాజమచంద్రపురం

కేంద్ర పాలిత ప్రాంతం యానాం నుండి అక్రమంగా మద్యం తరలిస్తున్న ఇద్దరు యువకులను ఎక్సైజ్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి 117 బీర్ బాటిల్స్‌ను స్వాధీనం చేసుకుని సాపిరెడ్డి వీర వెంకట సతీష్ మణికంఠ, పెమ్మిరెడ్డి శివశంకర్ వర ప్రసాద్‌ను అరెస్టు చేశారు. ఎక్సైజ్ శాఖ సిఐ కె.వీరబాబు కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

పేకాట శిబిరంపై దాడి

ప్రజాశక్తి-ఆత్రేయపురం

మండలంలోని గ్రామాల్లో శనివారం ఎస్ఐ బివై.కిరణ్ కుమార్ విస్తత దాడులు నిర్వహించారు. మేర్లపాలెం శివారులో తన సిబ్బందితో కలిసి దాడి నిర్వహించారు. ఈ దాడిలో పేకాడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకున్నారు.

ట్రిపుల్ ఐటికి విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి-కాజులూరు

ట్రిపుల్ ఐటికి నలుగురు విద్యార్థులు ఎంపికైనట్టు కాజులూరు జిల్లా పరిషత్ పాఠశాల హెచ్ఎం పంపన కృష్ణమూర్తి తెలిపారు. శనివారం కాజులూరు జిల్లా పరిషత్ పాఠశాలలో హెచ్ఎం కృష్ణమూర్తి మాట్లాడుతూ మార్చి నెలలో నిర్వహించిన పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన పూజిత సత్య సాయి (నూజివీడు), కుసుమవల్లి, మొగులూరు వరప్రసాద్, మొండి లోవ సురేష్ (శ్రీకాకుళం) సెంటర్లకు ఎంపికైనట్టు ఆయన తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ఎంపిపి మాత భారతి మురళి, జెడ్‌పిటిసి వనుం వెంకట సుబ్బారావు, మండల విద్యాశాఖ అధికారులు కె.వివేకానంద, పి.జాన్ అభినందించారు.

వేగవంతంగా పారిశుధ్య పనులు

ప్రజాశక్తి -కరప

గ్రామాల్లో పారిశుధ్య పనులను వేగవంతంగా చేయిస్తున్నట్టు మండల పంచాయతీ విస్తరణాధికారి ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. జెడ్.భావారం, కొరిపల్లె, నడకుదురు, జి.భావారం, తదితర గ్రామాలలో పంచాయతీ కార్యదర్శులు డ్రైనేజీ పూడికతీతలను తీయించి ముగ్గు, బ్లీచింగ్ వంటి పౌడర్లను చల్లించామన్నారు.

ఇంటింటికీ టిడిపి మినీ మేనిఫెస్టో

ప్రజాశక్తి-కాకినాడ

టిడిపి మినీ మేనిఫెస్టో కరపత్రాలను ఇంటింటికి పంపిణీ చేస్తున్నట్టు పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు సుంకర పావని తెలిపారు. మంగళగిరిలోని టిడిపి కార్యాలయంలో భవిష్యత్తు గ్యారెంటీ మినీ మేనిఫెస్టో కరపత్రాలను చంద్రబాబుతో ఆవిష్కరింప జేసినట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఇంటింటికీ మినీ మేనిఫెస్టో పథకాలను వివరించాల్సిందిగా చంద్రబాబు ఆదేశించారన్నారు. ప్రస్తుత వైసిపి పాలనలో అన్ని రకాల నిత్యావసర వస్తువులు ధరలు విపరీతంగా పెరిగి సామాన్యులు బతకడమే కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. వచ్చే 2024 ఎన్నికల్లో చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసేందుకు రాష్ట్ర ప్రజలంతా సిద్ధంగా ఉన్నారన్నారు.

అభివృద్ధి సంక్షేమాలే టిడిపి లక్ష్యం

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

అభివద్ధి, ప్రజా సంక్షేమం కోసం టిడిపిని తిరిగి అధికారంలోకి తీసుకురావాలని కాకినాడ రూరల్ మాజీ ఎంఎల్ఎ పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణ మూర్తి పేర్కొన్నారు. ఎస్.అచ్యుతాపురంలో వస్తున్నా మీ గ్రామానికి మీ అనంతలక్ష్మి కార్యక్రమంలో అనంతలక్ష్మి మాట్లాడుతూ చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అభివద్ధితోపాటు సంక్షేమ పథకాలను అర్హులైన అందరికీ అందించారనానరు. వైసిపి ప్రభుత్వం వచ్చాక ధరలన్నీ ఆకాశాన్ని అంటాయన్నారు. అభివద్ధి ఎక్కడా జరగలేదని ప్రజల వాపోతున్నారు. మళ్లీ చంద్రబాబును ముఖ్యమంత్రిగా చూడాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కర్రి వెంకటరాజు, సరిదే నాగ హరినాథ్, కోనాల కృష్ణ, నూకల ఉదయ భాస్కర్, వెలుపుకొండ రాంబాబు, లావేటి శ్రీను, కొఠారి తిరుమల రావు, గుండ్రోజు శ్రీనివాస్, గౌతు సూర్యనారాయణ, చింతపల్లి సత్తిబాబు పాల్గొన్నారు.

రిఫ్రెషర్ కోర్సు విజయవంతం

ప్రజాశక్తి-గండేపల్లి

ఆదిత్య సివిల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఒక వారం నిర్వహించిన 'పబ్లికేషన్స్, ప్రాజెక్ట్స్ అండ్ పేటెంట్స్' ఆన్‌లైన్ షార్ట్ టెర్మ్ రిఫ్రెషర్ కోర్సు విజయవంతమైనట్టు ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఎన్ఐటిలు, ఇతర విశ్వవిద్యాలయాల నుంచి వివిధ వనరుల వ్యక్తులు ప్రచురణలు, ప్రాజెక్టు మరియు పేటెంట్ల ప్రాముఖ్యతపై ఉపన్యాసాలు ఇచ్చారన్నారు. సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ బి.రామ్మోహన రెడ్డి మాట్లాడుతూ, అధ్యాపకులు, రీసెర్చ్ స్కాలర్లతో సహా మొత్తం 140 మంది ఈ కార్యక్రమం ద్వారా ప్రయోజనం పొందారని మరియు పరిశోధన మరియు అభివృద్ధి విభాగంలో జ్ఞానాన్ని పొందారని తెలిపారు.

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక14 వ వార్డు చల్లా వారి గరువు కాలనీలో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి శనివారం మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ తాటికొండ వెంకటలక్ష్మి, మున్సిపల్ డిఇ ఆదినారాయణరావు, మున్సిపల్ ఎఇ కృష్ణ జీవ ప్రసాద్, కో ఆప్షన్ సభ్యుడు వాసంశెట్టి గంగ, వైసిపి నాయకులు బొడ్డు ప్రకాష్, తాటికొండ పెదకాపు, బద్ది వీరబాబు పాల్గొన్నారు.

తొలకరి పనులతో కళకళ..



ప్రజాశక్తి-రాజమహేంద్రవరం ప్రతినిధి

తొలకరి వర్షంతో జిల్లాలోని వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. కొంత కాలంగా చినుకు జాడ కోసం నిరీక్షించిన రైతులకు తాజా వర్షాలు ఊరటనిచ్చాయి. జిల్లావ్యాప్తంగా సుమారు 2.50 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ సాగు జరగనుందని అధికారులు అంచనా వేస్తున్నారు. దీనిలో అత్యధికంగా 2 లక్షల ఎకరాలు వరి సాగు జరగనుంది. గోదావరి వరదలు, ప్రకృతి వైపరీత్యాల నుంచి రక్షణ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు సాగుకు రూపొందించిన కార్యాచరణలో ఆచరణలో అమలుకు నోచుకోలేదు. ధవళేశ్వరం బ్యారేజీ నుంచి తూర్పు, పశ్చిమ, మధ్య డెల్టా కాలువలకు జూన్ ఒకటి నుంచి నీరు విడుదల చేసినప్పటికీ రైతులు ముందస్తు సాగుకు వెనకడుగు వేశారు. సాంప్రదాయంగా తొలకరి వర్షం కోసం ఎదురు చూశారు. జలవనరుల శాఖ అధిదకారులు నీరు విడుదల చేసినప్పటికీ శివారు ప్రాంతాలకు ఇప్పటికీ నీరు చేరలేదు. కాల్వల పూడికతీత, ఆధునీకరణ (క్లోజర్) పనులు చేపట్టకపోడమే ఈ దుస్థితికి కారణమని తెలుస్తోంది. వ్యవసాయ రంగంలో నీటి వనరుల నిర్వహణే కీలకమైనది. అటువంటి పనులకు ప్రభుత్వం నిధులు కేటాయించటంలో అనుసరించిన నిర్లక్ష్యం చిత్తశుద్ధిని దర్పణం పడుతోంది. వర్షాలు ప్రారంభమైన అనంతరం కేవలం 17 కోట్లు కేటాయించటం విమర్శలకు దారి తీస్తోంది. కేటాయించిన నిధులు తూటుకాడ తొలగించాలని పేర్కొని ఆధునీకరణను పూర్తిగా అటకెక్కించిన వైనం రైతులను, రైతు సంఘాలను ఆందోళనకు గురి చేసిందనే చెప్పాలి. ఖరీఫ్ ఆలస్యానికి ప్రభుత్వమే కారణమని పలువురు అంటున్నారు.

ప్రహసనంలా సబ్సిడీ టమోటా

ప్రభుత్వం అందజేస్తున్న సబ్సిడీ టమోటా ప్రహసనంలా మారింది. కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతున్న నేపథ్యంలో ప్రజల నుంచి వ్యక్తమవుతున్న వ్యతిరేకతను నిలువరించేందుకు సబ్సిడీ టమోటా పంపిణీ ప్రారంభించింది. ఈ పంపిణీ జిల్లా కేంద్రంలోనే అస్తవ్యస్తంగా మారడం కొనుగోలుదారులను కలవరానికి గురి చేస్తోంది. ఎంపిక చేసిన కొన్ని రైతు బజార్లలో సబ్సిడీ టమోటా విక్రయాలు జరుగుతున్నాయి. ఆధార్ కార్డు నమోదు చేసుకుని అక్కడి అధికారులు కేజీ రూ.10 చొప్పున పంపిణీ చేస్తున్నారు. బహిరంగ మార్కెట్లో ఇప్పటికీ కేజీ రూ.140 ధర ఉంది. ధరతో పోల్చితే కొంత ఊరట లభించిన మాట వాస్తవమేనని చెబుతున్న కొనుగోలుదారులు కేజీ టమోటా కోసం గంటపాటు క్యూలో నిలబడుతున్నామని వాపోతున్నారు. కొన్నిసార్లు కొద్ది మందికి మాత్రమే పంపిణీ చేసి స్టాకు లేదనే బోర్డులు పెట్టడం విస్మయానికి గురి చేస్తోంది. దీంతో ఉదయం నుంచే రైతు బజార్ల వద్ద భారీ క్యూ దర్శనమిస్తోంది. టమోటా సంగతి మినహాయిస్తే ఇతర కూరగాయలు సైతం ఇప్పటికీ ధరలు అందుబాటులోకి రాలేదు. వంకాయలు, బెండకాయలు, చిక్కుడు కాయలు తదితర ఏరకమైనా రూ.50 పై మాటే. ఆకు కూరలు కట్ట రూ.10 చేరడంతో కొనుగోలు దారులకు చుక్కలు కన్పిస్తున్నాయనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

కదం తొక్కిన అంగన్‌వాడీలు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యాన్ని ఎండగడుతూ అంగన్‌వాడీలు చేపట్టిన ఆందోళనలు మిన్నంటాయి. రాష్ట్ర వ్యాప్తంగా 36 గంటల పాటు ఈ ఆందోళనలు కొనసాగాయి. ఉమ్మడి జిల్లాలలోని కలెక్టరు, సబ్ కల్టెరు కార్యాలయాల ఎదుట ఆందోళనలు నిర్వహించటంతో పాటు భారీ ర్యాలీలు నిర్వహించారు. అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లను సాధించుకునేందుకు జిల్లాల వారీగా చేస్తున్న ఆందోళనలపై ప్రభుత్వంస్పందించలేదు. దీంతో రాష్ట్ర వ్యాప్త ఉద్యమానికి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ పిలుపునిచ్చింది. ఈ పిలుపుతో వందలాది మంది అంగన్వాడీలు కదం తొక్కారు. అంగన్‌వాడీలకు మద్దతుగా పలు ప్రజా సంఘాలు, కార్మిక సంఘాలు వెంటనడిచాయి. పాలక ప్రభుత్వాలకు హెచ్చరిక చేశాయి.

గోదావరికి వరద నీరు

ఎగువ రాష్ట్రాలో కురిసిన వర్షాలతో గోదావరి నదికి క్రమ క్రమంగా వరద నీరు చేరుతోంది. గతేడాది ఇదే నెలలో ప్రమాద ఘంటికలు మోగిన విషయం విదితమే. ప్రస్తుతానికి ఆ స్థాయిలో వరద లేనప్పటికీ గత అనుభవాలను గుర్తు చేసుకుని ప్రజలు ఆందోళనకు గురౌతున్నారు. తాజాగా ధవళేశ్వరం బ్యారేజీ వద్ద 8.75 అడుగుల నీటిమట్టం నమోదైంది. ఎగువ నుంచి 80 వేల క్యూసెక్కుల నీరు వస్తుందనే సమాచారంతో అధికార యంత్రాంగం అప్రమత్తమయ్యింది. బ్యారేజీ వద్ద ఉన్న 175 గేట్లలో 48 గేట్లు ద్వారా నీటిని దిగువకు విడుదల చేస్తోంది. మరో వైపు గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రాజమహేంద్రవరంలో అనేక ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. రాబోయే రోజుల్లో గోదావరి వరద నీరు పెరిగితే వర్షపు నీరు నదిలోనికి విడుదల చేసే అవకాశాలు తక్కువే. అధికారులు ఇప్పటికైనా అప్రమత్తమై సైడ్ డ్రయిన్‌లు పూడిక తీత పనులు వేగవంతం చేసి ముంపునుంచి రక్షించాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

పంట కాలువ కాదు కెనాల్ రోడ్డే..

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్



రోడ్డులో నీటి ప్రవాహంలో వాహనాలు

జిల్లాలో అత్యంత ప్రాధాన్యత గల సామర్లకోట-కాకినాడ కెనాల్ రోడ్డు దుస్థితి ఇలా మారిపోయింది. సామర్లకోట మండలం వికె.రాయపురం - మాధవపట్నం గ్రామాల మధ్య కాకినాడ మెయిన్ రోడ్డుపై వర్షాలుకు తోడు వరద జలాలు ప్రవహిస్తుండడంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరి కాలువల్లో జలాలు అధిక స్థాయిలో చేరడంతో కాకినాడ మెయిన్ రోడ్డుకు ఇరువైపులా ఉన్న కాలువలు పొంగిపొర్లుతున్నాయి. దీంతో శుక్రవారం రాత్రి నుంచి మాధవపట్నం గ్రామం వద్ద వరద జలాలు మెయిన్ రోడ్డు మీద ప్రవహిస్తుండడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అసలే గోతుల మయంగా మారిన ఈ రహదారి జలాలతో నిండుకోవడంతో గోతులు కనిపించక ప్రయాణికులు ప్రమాదవసత్తు అదుపుతప్పి గోతుల్లో పడుతున్నారు.

పలువురికి ఆర్థిక సాయం

కొత్తపేట : ఇటీవల అనారోగ్యంతోను, మతిచెందిన కుటుంబాలను ఎంఎల్ఎ చిర్ల జగ్గిరెడ్డి పరామర్శించి ఆర్థిక సహాయాన్ని అందించారు కొత్తపేట మండలం వానపల్లి గ్రామానికి చెందిన పట్టా రాజు కుటుంబసభ్యులను పరామర్శించి రూ.20 వేల సాయం అందజేశారు. కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ డయాలిసిస్ చేయించుకుంటున్న వానపల్లి శివారు కోతుల తోటకు చెందిన గుత్తుల సాయిని రూ.10 వేల సాయం అందచేశారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన అవసరం

ప్రజాశక్తి-ఆలమూరు

సీజనల్ వ్యాధులపై రాకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్త వహించాలని వైద్యాధికారులు పి.భవానిశంకర్, ఆర్.సుదర్శన్ బాబు, డి.మల్లికార్జున, డి.సువర్చలానాయుడు అన్నారు. పెద్దపళ్ల, చొప్పెల్ల పిహెచ్సి ఆరోగ్య పర్యవేక్షకులు పివి.రమణారావు, వెంకటేశ్వరరావు, వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో వారి పర్యవేక్షణలో శనివారం మండలంలోని పలుగ్రామంలో అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా ఏఎన్ఎం, ఆశావర్కర్ల సహకారంతో స్థానిక ప్రజలకు, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు డెంగీ, మలేరియా వంటి సీజనల్ వ్యాధులతో పాటుగా కుష్టు వ్యాధి, వ్యక్తిగత పరిశుభ్రత, ఆహార భద్రత అలవాట్లపై వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముందుగా మలేరియా,డెంగ్యూ రెండూ దోమల ద్వారా వ్యాపించే వ్యాధులని, ఇవి మరే ఇతర వ్యాధి లేని విధంగా ప్రజలను భయపెడుతున్నాయన్నారు. దోమల సమూహాలు అపరిశుభ్రమైన ఇళ్లకు చేరుకుని భయాందోళనలకు గురిచేస్తాయన్నారు. ఇంటి పరిసర ప్రాంతాలలో వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ మురికి నీటి నిలవలు లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచఒ పి. వెంకటరత్నం, రాధాకృష్ణ, వైద్య సిబ్బంది, ఎఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

నేడు బోస్ అనుచరుల సమావేశం

ప్రజాశక్తి రామచంద్రపురం



వివరాలు వెల్లడిస్తున్న వైసిపి నాయకులు

రామచంద్రపురం నియోజకవర్గ ఎంఎల్ఎ, రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణు గోపాల కష్ణ విధానాలకు వ్యతిరేకంగా వైసిపి కార్య కర్తలు సమావేశమవుతున్నారు .ఈ మేరకు ఆదివారం ద్రాక్షారామ సాయి మాధవ ఫంక్షన్ హాల్ లో సమావేశానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు దొంగా శ్రీధర్ విలేకరుల తో మాట్లాడారు.గత నాలుగేళ్లగా కార్యకర్తలకు అనేక అవమానాలకు గురయ్యారని అన్నారు. బోస్ దయతో గెలిచిన వేణు బోస్ నుకలిసే కార్యకర్తలను పలు విధాలుగా వేధిస్తున్నారని వారిపై తప్పుడు కేసులు బనాయించి కోర్టుల చుట్టూ తిప్పుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తామంతా వైసిపికి వ్యతిరేకం కాదని కేవలం మంత్రి వేణు కు వ్యతిరేకమన్నారు. ఆయనను వ్యతిరేకించే వందలాది మంది ఈ సమావేశానికి హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఇంత సంతోషం, పోలినాటి ప్రసాద్, డి.బాల పాల్గొన్నారు.

ఘనంగా డాక్టర్ కెఎల్.రావు జయంతి

ప్రజాశక్తి-కాకినాడ

జెఎన్టియుకె ప్రాంగణంలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ భవనంలో శనివారం పద్మభూషణ్ డాక్టర్ కానూరు లక్ష్మణరావు 122వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న విసి జివిఆర్.ప్రసాదరాజు మాట్లాడుతూ భావి ఇంజనీర్లు కెఎల్.రావును మార్గదర్శకంగా తీసుకుని దేశ సర్వతోముఖాభివద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో లేని రోజుల్లోనే ఆయన తన ప్రతిభను చాటి సరికొత్త ఆవిష్కరణలకు నాంది పలికారన్నారు. నిర్మాణ రంగంలో కె.ఎల్.రావు చేసిన సేవలు ఎనలేనివన్నారు. ఈ కార్యక్రమంలో వి.శ్రీరామారావు, ఆర్ఎస్ఐఇఎకె ప్రెసిడెంట్ ఇంజనీర్ ఎన్.కృష్ణారావు, పి.ప్రసాద్, ప్రొఫెసర్ ఎం.రమేష్, వి.జయప్రసాద్ పాల్గొన్నారు.

మానసిక ఒత్తిడిపై అవగాహన

ప్రజాశక్తి -కరప

విద్యార్థులకు మానసిక ఒత్తిడి జయించడం తదితర అంశాలపై జిల్లా మానసిక ఆరోగ్య ప్రోగ్రాం కన్సల్టెంట్ సైకియాట్రిస్ట్ డాక్టర్ రామారెడ్డి అవగాహన కల్పించినట్లు డాక్టర్ క్రాంతి సౌజన్య తెలిపారు. వేళంగి హైస్కూల్లో శనివారం జిల్లా మానసిక ఆరోగ్య ప్రోగ్రాం కన్సల్టెంట్ సైకియాట్రిస్ట్ డాక్టర్ రామారెడ్డి, లైఫ్ స్కిల్స్, స్ట్రెస్ మేనేజ్‌మెంట్, ఎఫెక్టివ్ లెర్నింగ్, డెసిషన్ మేకింగ్‌కి సంబంధించి అంశాలను విద్యార్థులకు వివరించారు.

పిజి సెట్‌లో 'వెంకటేశ్వర' విద్యార్థులకు ర్యాంకులు

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

ఎపి స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో ఆంధ్రా యూనివర్సిటీ నిర్వహించిన ఏపీ పి.జి.సెట్ 2023 ఫలితాలలో స్థానిక శ్రీ వెంకటేశ్వరా కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాల ఫైనల్ ఇయర్ విద్యార్థులు స్టేట్ టాప్ ర్యాంక్ లు సాధించినటు కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కెవిఆర్ఎన్.నరసింహ రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్టేట్ టాప్ ర్యాంకర్లను కళాశాలలో జరిగిన అభినందన సభలో ప్రిన్సిపల్ కెఎస్‌విఎన్.మనోహర్, ఎఒ కరాటం ప్రవీణ్, ఛైర్‌పర్సన్ మల్లిపూడి విజయ లక్ష్మి, ఆఫీసర్స్ కె.శ్రావణ్ దిలీప్, డా.కె.హేమావిజిత, సీనియర్ లెక్చరర్లు, పలువురు ప్రముఖులు అభినందించారు.

యానాం రోడ్డులో డ్రంక్ అండ్ డ్రైవ్ చేపట్టాలి

ప్రజాశక్తి-కాజులూరు

యానాం ద్రాక్షారామ రహదారిలో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు. శనివారం ఉప్పుమిల్లి కుయ్యేరు కొలంక పరిసర ప్రాంతాలకు చెందిన పలువురు వాహనదారులు మాట్లాడుతూ ఈ రహదారిలో నిత్యం పలు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని దీనికి ప్రధాన కారణం మద్యం సేవించడమేనని వారన్నారు. నిత్యం రాజమహేంద్రవరం, రామచంద్రపురం మండపేట పరిసర ప్రాంతాల నుంచి యువకులు ముగ్గురు నలుగురు ఒకే బైక్‌పై వచ్చి యానాంలో మద్యం ధరలు తక్కువగా ఉండడంతో అడ్డూ అదుపూ లేకుండా మద్యం సేవించి తాగుతూ పరిసర ప్రాంత వాళ్లని భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. శని ఆదివారాల్లో వీరికి అడ్డూ అదుపూ లేకుండా పోతుందన్నారు. అధికారులు స్పందించి డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించాలని కోరుతున్నారు.

గ్రామీణ విత్తన ఉత్పత్తిపై రైతులకు శిక్షణ

ప్రజాశక్తి-అయినవిల్లి

మాగం గ్రామం రెండో నెంబర్ కాలవ గట్టు వద్ద రైతులకు గ్రామీణ విత్తన ఉత్పత్తి పై శిక్షణా కార్యక్రమం మండల వ్యవసాయ అధికారి వై శోభ అధ్యక్షత జరిగింది జిల్లా వనరుల కేంద్రం నుంచి వ్యవసాయ సహాయకులు రాజశేఖర్ పాల్గొని మాట్లాడుతూ ఈ పథకనికి ప్రభుత్వం 50 శాతం రాయితీతో ఫౌండేషన్ విత్తనాలను రైతులకు అందిస్తుందన్నారు. దీని ద్వారా రైతులు తమ విత్తనాలను తామే తయారు చేసుకోవాలన్నారు. విత్తనానికి విత్తన శుద్ధి చేసుకోవాలని విత్తన శుద్ధి ద్వారా క్రమించే వ్యాధులు మరియు తెగులను కొంతవరకు నివారించవచ్చునని అన్నారు. నారుమడులలో ఎరువుల యాజమాన్యం పురుగులు, తెగుళ్ల సోకకుండా రైతులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఆత్మ నుంచి డిప్యూటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ జ్యోతిర్మయి పాల్గొని పర్యావరణ పరిరక్షణ గురించి వివరించారు ఈ కార్యక్రమంలో ఎఒ మనోహర్, విహెచ్ఎ జీవనసుధ రైతులు పాల్గొన్నారు.

యానాం వార్తలు

గృహ నిర్మాణ లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - యానాం

యానాం నియోజకవర్గానికి సంబంధించి గహ నిర్మాణాలు చేపట్టిన లబ్ధిదారులకు సంస్థ క్లియరెన్స్ బోర్డు ఆధ్వర్యంలో స్థానిక ప్రాంతీయ పరిపాలనాధికారి కార్యాలయంలో ఆర్ఎఒ శనివారం చెక్కులు పంపిణీ చేశారు. మూడు విడతలకు సంబంధించి 53 మంది లబ్ధిదారులకు సుమారు రూ.58 లక్షల 80 వేలు వారి బ్యాంక్ ఖాతాలో జమ చేయనున్నట్లు తెలిపారు.

ఉషారాణి బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - యానాం

యానాం డైరెక్టర్ ఆఫ్ అకౌంట్స్ అండ్ ట్రెజరీస్ డిప్యూటీ డైరెక్టర్‌గా వినకోటి ఉషారాణి అదనపు బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం ప్రజాపనుల శాఖలో జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్‌గా ఆమె విధులు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు ఆర్థిక శాఖ కార్యదర్శి రత్న ఘోష్ కిషోర్ ఆదేశాలు జారీ చేశారు. శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన ఉషారాణి మర్యాదపూర్వకంగా ఆర్ఎఒ మునిస్వామిని కలిశారు.

ఘనంగా విద్యార్థుల దినోత్సవం

ప్రజాశక్తి - యానాం

పెరుంతలైవర్ కామరాజర్ జయంతిని పురస్కరించుకుని విద్యాశాఖ ఆధ్వర్యంలో స్థానిక చిల్డ్రన్స్ ఆడిటోరియంలోని విద్యార్థుల దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పుదుచ్చేరి ప్రభుత్వం ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, ఆర్ఎఒ మునిస్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మల్లాడి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. ప్రాంతీయ విద్యాశాఖ అధికారి పంపన లక్ష్మణ్ ప్రవీణ్, ఎస్ఆర్‌కె ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ వరుగు భాస్కర్ రెడ్డి, ఎడిపిసి కమిడి ప్రభాకర్ రావు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు.

కో-ఆపరేటివ్ సిబ్బంది దీక్ష విరమణ

ప్రజాశక్తి - యానాం

కో ఆపరేటివ్ స్టోర్స్ సిబ్బంది తమ 30 నెలల బకాయి వేతనాల కోసం చేపట్టిన దీక్షను శనివారం విరమించారు. పుదుచ్చేరి ప్రభుత్వ ఉద్యోగ సంఘాల ఫెడరేషన్ యానాం అధ్యక్షుడు చెల్లి గోపీనాథ్, రాష్ట్ర బిసి సేన ప్రధాన కార్యదర్శి మల్లాడి సత్తిబాబు సిబ్బందికి నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింప చేశారు. అనంతరం పరిపాలనాధికారి మునిస్వామిని కలిసి తమ సమస్యలను వివరించారు. ఐదు రోజులుగా పుదుచ్చేరి ఉన్నతాధికారులు, నాయకులతో మాట్లాడుతున్నానని త్వరలో సమస్యలు పూర్తిగా పరిష్కరించే విధంగా చర్యలు చేపడుతున్నామని హామీ ఇచ్చారు. శనివారం దీక్షా శిబిరం వద్ద పలువురు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా సిబ్బంది మాట్లాడుతూ ఐదు రోజులు ఆందోళనకు తమకు సంఘీభావం తెలిపిన అందరికీ కృజ్ఞతలు తెలియజేశారు.